క్లుప్తంగా

శ్రీవారి సేవలో విజయానందరెడ్డి



ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: తిరుమల శ్రీవారిని చిత్తూరు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి భార్య ఇందుమతి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి



గుడిపాల: రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గుడిపాల: గ్రామాల్లో అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. సోమవారం నంగమంగళంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉండేదని.. ప్రస్తుతం మీ గ్రామంలోకి వైద్యసేవలు తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం షుగర్, బీపీ, గర్భిణులకు చికిత్స చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటికే పరిమితమైన వారిని ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో సుమతి, కాంచన, కిరణ్‌కుమారి, శివగామి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలు తొలగించరా..!



జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

చిత్తూరు కార్పొరేషన్: పల్లెలు పరిశుభ్రంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి దగ్గర నుంచి కిందిస్థాయిలో ఉండే పంచాయతీ సెక్రటరీ వరకు చెప్పే మాట. వర్షాలు వచ్చినప్పుడు.. వర్షపునీరు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచిస్తుంటారు. పైగా ప్రతి శుక్రవారం ఫ్రైడే–డ్రైడే పాటించాలని చెబుతారు. మనం కూడా ఊర్లో పారిశుద్ధ్యం లోపిస్తే క్లాప్ మిత్ర, కార్యదర్శులకు చెబుతాం. వారు స్పందించకపోతే జిల్లా పంచాయతీ అధికారికి తెలియజేస్తాం. అదే జిల్లా పంచాయతీ కార్యాలయం చుట్టూ అపరిశుభ్రత తాండవిస్తే ఎలా అని పలువురు అంటున్నారు. కార్యాలయం వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో నిర్వహణా లోపం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా కనిపిస్తోంది. దోమల బాధతో ఉద్యోగులు అవస్థ పడుతున్నారు. నిత్యం కార్యాలయానికి పలు పంచాయతీల నుంచి కార్యదర్శులు, సర్పంచులు వస్తుంటారు. అలాంటి ప్రాంతంలో పారిశుద్ధ్యం దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా..ఇలా..



తేనెబండలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల మొక్కలు

చిత్తూరు కార్పొరేషన్: అసలే చిన్న రోడ్డు.. అందునా గుంతలు పడి ఉంటాయి. దానికి తోడు వీధిదీపాలు అసలు వెలగవు. వీటికి తోడు అదనంగా కుక్కల బెడదతో ఇటువైపుగా వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. నగరంలోని తేనెబండలో బ్రిడ్జి సమీప ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ముళ్ల మొక్కలు అడ్డంగా పెరిగాయి. అటువైపుగా వాహనాల్లో వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. చీకటి వేళ్లలో వీధిదీపాలు సక్రమంగా పని చేయకపోవడంతో రోడ్డును చూసుకుంటూ ప్రయాణించాల్సిన పరిస్థితి. కుక్కలు రోడ్లపై స్వైరవిహారం చేస్తుంటాయి. కనీసం మొక్కలను అయినా తొలగిస్తే ఇబ్బందులు తప్పుతాయని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌–కారు ఢీ



తీవ్రగాయాలపాలైన క్షతగాత్రుడు రామ్మూర్తి

పూతలపట్టు(యాదమరి): చిత్తూరు–కడప జాతీయ రహదారి రంగంపేట క్రాస్ బ్రిడ్జి వద్ద సోమవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో తండ్రి, కూతురు తీవ్ర గాయాలపాలయ్యారు. పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ వివరాలు మేరకు.. సదుం మండలం చీకలచేను గ్రామానికి చెందిన రామ్మూర్తి తన కుమార్తెతో కలిసి ద్విచక్ర వాహనంలో చిత్తూరు నుంచి తమ స్వగ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో తిరుపతి నుంచి చెన్నై వెళ్తున్న కారు వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని అతివేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలైంది. క్షతగాత్రులను 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పుతున్న దృశ్యం



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు



భవితకు భరోసా ఇస్తూ..

పుట్టుకతోనే అంగవైకల్యం కలిగిన ఆ చిన్నారులను అక్కున చేర్చుకుంటూ వారి భవిష్యత్‌కు భవిత కేంద్రాలు బంగారు బాటలు వేస్తున్నాయి. వారి మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటపాటలతో సహిత ఉపాధ్యాయులు ఉత్తేజ పరుస్తున్నారు. అవయవ లోపం, బుద్ధిమాంద్యం వంటి మానసిక, శారీరక వైకల్యం గల చిన్నారుల్లో మనోధైర్యం నింపి వారి పురోగభివృద్ధికి భవిత కేంద్రాలు దోహద పడుతున్నాయి. అంగవైక్యలం తగ్గడానికి ఉచితంగా ప్రత్యేకంగా ఫిజియోథెరపీ వైద్యం అందుబాటులో ఉంది.

- దివ్యాంగ చిన్నారులను అక్కున చేర్చుకుంటున్న భవిత కేంద్రాలు
- మానసికోల్లాసంతో పాటు 21 రకాల సేవలతో కూడిన సహిత విద్య
- ప్రతి బుధవారం ప్రత్యేక ఫిజియోథెరపీ సేవలు
- గత ప్రభుత్వంలో వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లను, హియరింగ్ మిషన్లతో పాటు పలు పరికరాలు అందజేత
- ఇప్పుడు కూడా గతంలో మాదిరి పరికరాలు అందించాలని కోరుతున్న తల్లిదండ్రులు

గుడిపాల: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలు ఆసరాగా నిలుస్తున్నాయి. సాధారణంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితం అయ్యేవారు. దీంతో వీరి తల్లిదండ్రులకు వారి పట్ల ప్రత్యేకశ్రద్ధతో చూసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాలు భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో నూతన ఉత్సాహం నింపి వారి మనోవికాసానికి బాటలు వేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో గతంలో వారి వ్యక్తిగత పనులను కూడా చేసుకోలేని పిల్లలు సైతం వారి అవసరాలను వారు సొంతంగా చేసుకొనే స్థితికి అభివృద్ధి చెందడంతో వారి తల్లిదండ్రులు భవిత కేంద్రాల నిర్వహణపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందజేసే సహిత విద్యను విద్యాశాఖలో భాగమైన సమగ్రశిక్షా పథకం ద్వారా భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు సంరక్షించి వారికి 21 రకాల సేవలతో కూడిన సహిత విద్యను అందిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన పథకంతో పాటు మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటపాటలతో ఉత్తేజ పరచి వారిని ప్రోత్సహిస్తున్నారు. గుడిపాల మండల కేంద్రంలో నరహరిపేట జెడ్పీ హైస్కూల్ ఆవరణలోని భవిత కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రోత్సహించి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు. ఈ కేంద్రంలో ప్రతి బుధవారం ప్రత్యేక ఫిజియోథెరపీ శిక్షణా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణా కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందించాల్సిన ఫిజియోథెరపీ గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో వారిలో శరీర వైకల్యాన్ని తగ్గించేందుకు తేలికపాటి యోగాసనాలు, ఎక్సర్‌సైజుల గురించి వివరిస్తున్నారు. అంతేగాక వారి తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నారు. వీటితో పాటు మంచానికే పరిమితమైన వారిని వారంలో రెండురోజులు గృహసందర్శన చేసి సహిత ఉపాధ్యాయుల ద్వారా వారికి అవసరమైన ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేయడంతో పాటు వినికిడి, ఇతర శరీర అవయవ లోపాలు కలిగిన చిన్నారులను గుర్తించి సమగ్ర శిక్షా ద్వారా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లను, హియరింగ్ మిషన్లు వంటి వివిధ రకాల పరికరాలను అందజేసింది. కూటమి ప్రభుత్వం కూడా దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి అవసరమయ్యే పరికరాలను అందజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మా దృష్టికి తెస్తున్నాడు..



మా బాబు వేదాంత్ బుద్ధిమాంద్యంతో జన్మించాడు. చిన్నగా ఉన్నప్పుడు ఏ విషయం కూడా మాకు చెప్పేవాడు కాదు. బాబు పరిస్థితి చూసి చాలా ఆందోళనగా ఉండేది. భవిత కేంద్రంలో చేర్పించిన తరువాత నిత్యం ఫిజియోథెరపిస్ట్ సూచనల మేరకు అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. దీంతో వాడిలో మార్పు కనబడుతుంది.

– సరస్వతి, బండపల్లె, గుడిపాల

గతం కంటే మెరుగ్గా ఉంది



మా బాబు సతీష్ పుట్టుకతోనే సరిగ్గా నడవక బలహీనంగా ఉండేవాడు. వాడికి ప్రతి పనిలో ఎవరో ఒకరు తోడు ఉండాల్సి ఉండేది. ఏ విషయం కూడా మాకు చెప్పలేక ఇబ్బంది పడేవాడు. భవిత కేంద్రానికి తీసుకురావడంతో కొన్ని విషయాలను మాకు చెప్పేందుకు ప్రయత్నిస్తుండడం కాస్త ఊరటగా ఉంది.

– రాముడు, అనుపు, గుడిపాల

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి



ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ చిన్నారులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారిని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పంపించినప్పుడే వారిలో మానసిక ఉత్సాహం కలిగి పురోభివృద్ధి సాధించగలుగుతారు. రోజూ వారికి అవసరమైన శారీరక శిక్షణను కూడా మా సూచనల మేరకు అందజేయాలి. అప్పుడే వారిలో మార్పుని తీసుకురాగలం.

– వాణి, ఐఈఆర్‌టీ టీచర్, గుడిపాల

తల్లిపాలే బిడ్డకు సంజీవని



తల్లులకు అవగాహన కల్పిస్తున్న అపోలో వైద్య బృందం



తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లులకు సూచనలిస్తున్న డాక్టర్ ప్రియాంక

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తల్లిపాలే బిడ్డకు సంజీవని అని అపోలో వైద్యులు, సిబ్బంది తెలిపారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లి పాలతో పాటు గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగించాలన్నారు. ముర్రుపాలు బిడ్డకు మొదటి సహజ టీకా అన్నారు. అందులో ఉండే ప్రొటీన్లు, ఫ్యాటీ యాసిడ్స్, లాక్టోజ్, విటమిన్లు, ఇమ్యూనో గ్లోబ్యులిన్స్ బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు, రోగ నిరోధక వ్యవస్థ బలపడేందుకు తోడ్పడుతాయన్నారు. అలాగే వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయన్నారు. తల్లులు పౌష్టిహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యబృందం లోకేశ్వరి, శోభారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

తవణంపల్లె: బిడ్డ పుట్టిన గంట వ్యవధిలోనే తల్లి ముర్రుపాలు తాగించడం వల్ల వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందని వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం మండలంలోని పుణ్యసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక తల్లులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను తినాలని సూచించారు. రక్తహీనత రాకుండా గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పురిటి బిడ్డతో పాటు పెద్ద పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ గోపి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణాల పరిశీలన



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న మేయర్

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న మురుగునీటి కాలువ నిర్మాణాలను మేయర్ అముద పరిశీలించారు. సోమవారం ఆమె నగరంలోని 39వ వార్డు గోకులం వీధిలో పర్యటించారు. అక్కడ 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న రెండు మురుగునీటి కాలువలను పరిశీలించి, పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత ఉండాలని, వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పంటల బీమాపై అవగాహన



నల్లపురెడ్డిపల్లెలో పంటల బీమా పథకంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో రైతులకు పంటల బీమా పథకంలో భాగంగా ప్రీమియం చెల్లింపునకు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు బీమా ద్వారా ఆదుకుంటామన్నారు. పంట కోత ప్రయోగాల ద్వారా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి బీమా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. పంట రుణం తీసుకున్న రైతులు కామన్ సర్వీస్ సెంటర్‌లో బీమా చేసుకోవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు సమీప రైతు సేవా కేంద్రాల్లో బీమా ప్రీమియం చెల్లించాలని సూచించారు. వరి పంటకు బీమా చెల్లించడానికి ఈ నెల 30వ తేదీ వరకు గడువును పెంచినట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా రాగి పంటకు ఎకరాకు రూ.170 ప్రీమియం చెల్లించి పంట నష్టపోతే రూ.17 వేలు అందిస్తారన్నారు. రూ.400 ప్రీమియం చెల్లిస్తే ఎకరాకు రూ.20 వేలు, రూ.840 ప్రీమియం చెల్లిస్తే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఎకరాకు రూ.42 వేలు బీమా వర్తిస్తుందని స్పష్టం చేశారు. రైతులు సకాలంలో ప్రీమియం చెల్లించి పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం



చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు





వర్షంలో తడుస్తూ ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

వర్షం.. కాస్త ఉపశమనం

మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 3 గంటల నుంచి 4 గంటల వరకు గంట పాటు వర్షం దంచి కొట్టింది. గత మూడు రోజులుగా ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఉన్నఫలంగా జోరుగా వర్షం కురవడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహించడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. జాతీయ రహదారి పక్కన గల లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోవడం, ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో అవస్థలు పడ్డారు. ఈ మధ్యకాలంలో ఇటువంటి భారీ వర్షం పడలేదని అంటున్నారు. ఇలాంటి వర్షాలు మండలవ్యాపంగా కురిస్తే చెరువులు నిండి పంటల సాగుకు, తాగునీటికి కొరత ఉండదని ప్రజలు అంటున్నారు.

– బంగారుపాళెం

నేడు చినకాంపల్లెలో పొలం పిలుస్తోంది

ఐరాల: మండలంలోని చినకాంపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ వరలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రేపు వాహనాల వేలం

తవణంపల్లె: మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తూ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు తవణంపల్లె పోలీస్ స్టేషన్‌లో జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో పట్టుబడిన వాహనాలను విక్రయించడానికి బహిరంగ వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రుసుం చెల్లించి పాల్గొనాలని సూచించారు. ఇతర వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్‌ఎస్)లో వచ్చిన అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నగర ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్‌ఓ డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

గుడిపాల: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. చెన్నై–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డులో వసంతాపురం సమీపంలో రోడ్డు పక్కన మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. సుమారు 50 సంవత్సరాలు పైబడి ఉన్న వ్యక్తి మృతిచెంది పడివున్నట్టు గుర్తించామన్నారు. మృతుడు రెడ్ షర్ట్, బ్లాక్ డ్రాయర్ వేసుకున్నట్టు తెలిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా ధ్వజారోహణం

గంగాధర నెల్లూరు: మండలంలోని కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత శివషణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సోమవారం ఆడికృత్తిక సందర్భంగా ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమాలు చేశారు. ఈ నెల 15న భరణి, 16న కృత్తిక కావడి చెల్లింపులు, 17న కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, గ్రామస్తులు

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి



ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ జగదీష్‌కు వినతిపత్రం ఇస్తున్న చైతన్య

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులపై వేస్తున్న ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్, ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ జగదీష్‌కు విద్యుత్ వినియోగదారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చైతన్య, కార్యదర్శి వేణు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం వేస్తున్న వాటితో పాటు భవిష్యత్‌లో వేయనున్న ట్రూఅప్ చార్జీలును రద్దు చేయాలన్నారు. గృహ సర్వీసులకు అదానీ స్మార్ట్ మీటర్లు బిగించవద్దన్నారు. గతంలో డిస్కంలకు వచ్చిన లోటును సాకుగా చూపుతూ రాష్ట్రంలోని వినియోగదారులపై రూ.3,046 కోట్లు భారం వేయడానికి ఏపీఈఆర్సీ అంగీకరం తెలిపిందన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే విద్యుత్ భారాలపై కష్టాలు పడుతున్న ప్రజలపై మరింత భారం వేయడం సరికాదన్నారు. ఇది కాకుండా ప్రతినెల సర్దుబాటు చార్జీల పేరుతో యూనిట్ కు రూ.40 పైసలు వసూలును రద్దు చేయాలని వివరించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
చిత్తూరు – పూతలపట్టు :
95539 55610